RNI NO TGTEL/25/A3369

సమస్త ప్రక్షాళనం

తెలుగు దినపత్రిక

ప్రచురణ : సంగారెడ్డి, సంపుటి : 01 సంచిక : 188 ఎడిటర్ : జె. భాస్కర్, గురువారం 05-11-2026 పేజీలు : 04 వెల : 2/-

ఆర్టీవోలో అవినీతి "చక్రం" తిప్పుతున్న అధికారులు

- ఆర్టీఏలో ఆడిందే ఆట.. పాడిందే పాట
- దళారీలతో కుమ్మక్కైవసూళ్ల దందా
- ప్రతీ పనికో రేటులో కొందరి ఏఓలే కీలకం
- కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్న వైనం
- ఆర్టీఓలనూ తప్పుదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు
- ఫైళ్లను కాసులతో లెక్కిస్తున్న ఇటీవల బదిలీపై వచ్చిన ఓ ఏఓ
- ఇప్పటికే ఆర్టీఏ కార్యాలయాల్లో 10 నెలల్లో 3 సార్లు ఏసీబీ దాడులు

హైదరాబాద్ : ఏఓల ఇష్టారాజ్యం నగరంలోని కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో కొందరు ఏఓలు ఆడిందే ఆట పాడిందే పాట అవుతున్నది. ఈ ఏడాదిలో ఆర్టీఏ కార్యాలయాల్లో మూడు సార్లు అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు చేసి పలు కార్యాలయాల్లో జరిగిన అక్రమ కార్యకలాపాలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడుల నేపథ్యంలో రవాణా శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పలు కార్యాలయాలని సందర్శించి పారదర్శక సేవలపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చింది.

ఆర్టీఏలో ఆడిందే ఆట.. పాడిందే పాట


దళారీలతో కుమ్మక్కైవసూళ్ల దందా

ప్రతీ పనికో రేటులో కొందరి ఏఓలే కీలకం

కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్న వైనం

ఆర్టీఓలనూ తప్పుదారి పట్టిస్తున్నట్టు ఆరోపణలు

ఫైళ్లను కాసులతో లెక్కిస్తున్న ఇటీవల బదిలీపై వచ్చిన ఓ ఏఓ



ఇప్పటికే ఆర్టీఏ కార్యాలయాల్లో 10 నెలల్లో 3 సార్లు ఏసీబీ దాడులు నగరంలోని కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో కొందరు ఏఓలు ఆడిందే ఆట పాడిందే పాట అవుతున్నది. ఈ ఏడాదిలో ఆర్టీఏ కార్యాలయాల్లో మూడు సార్లు అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు చేసి పలు కార్యాలయాల్లో జరిగిన అక్రమ కార్యకలాపాలను గుర్తించిన విషయం తెలిసిందే. అయితే ఈ దాడుల నేపథ్యంలో రవాణా శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పలు కార్యాలయాలని సందర్శించి పారదర్శక సేవలపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చింది. ఎటువంటి బ్రోకర్లు కార్యాలయాల్లోకి ఎంట్రీ ఇచ్చినా అది సంబంధిత ఆర్టీఓదే బాధ్యత అని హెచ్చరించింది.

వంకలు.. వసూళ్లు!


ఆర్టీఏలో కొందరు ఏఓలు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోవడం లేదు. ఆర్టీఓలపై ఓ ఉద్యోగ సంఘంలో తమది కీలక రోల్ అంటూ ఒత్తిడి తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఇతర జిల్లా నుంచి హైదరాబాద్‌లోని ఓ జోన్‌కు బదిలీ అయిన ఓ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడంలో కీలకపాత్ర వహిస్తున్నారు. ఆయన పరిధిలో అయ్యే ప్రతీ పనికి ఓ ధర నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అ కార్యాలయ ఆర్టీఓ అలా చేయొద్దని వాదించినా వినిపించుకోకుండా సంఘం ముసుగులో బెదిరింపులకు పాల్పడటం ఆ కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశమైంది. అదే కార్యాలయంలో పలు అక్రమాలపై గతంలో పోలీస్ కేసులు నమోదయ్యాయి. కొన్ని వాహనాలకు సంబంధించిన యజమానులు మరణిస్తే వాటిని పరిశీలించకుండానే అమ్యామ్యాలతో వాహన యాజమాన్య హక్కులు మార్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆ విషయం పై సదరు కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఏఓ.. ఏ కార్యాలయంలో విధులు నిర్వర్తించినా వాహనదారులకు సంబంధించిన ఫైళ్లను కాసులతోనే లెక్కిస్తాడని సిబ్బంది సైతం చర్చించుకుంటున్నారు.

మిగతా 2లో

నమ్మకు.. నమ్మకు సర్కారును!!!

- క్రాప్ హాలిడే పై గందరగోళం
- రైతన్నల డైలమా
- యాసంగి పంటల విషయంలో అమాత్యుల అనుచిత వ్యాఖ్యలు
- తెలంగాణపై ఎల్ నినో ప్రభావం తీవ్రం
- పంటలు వేయాలా? వద్దా?
- స్పష్టత లేని సమాచారం
- పంటల విషయంలో చేతులెత్తేసిన వ్యవసాయశాఖ
- 11.18 లక్షల ఎకరాల్లో పూర్తిగా ఎండిపోయిన పంటలు

హైదరాబాద్ : తెలంగాణపై ఎల్ నినో ప్రభావం చాలా తీవ్ర ప్రభావం చూపుతోంది. దాని ప్రభావం ఏ స్థాయిలో ఉందంటే రాబోయే రబీ సీజన్ల..యాసంగి పంటల విషయంలో సర్కార్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ఆంతర్యం 'క్రాప్ హాలిడే' అనే అర్థమవుతున్నది. పంటలు వేయాలా వద్దా అనే స్పష్టమైన సమాచారం రైతులకు ఇవ్వకుండా ప్రభుత్వ పెద్దలు మాట దాటవేస్తున్నారు. విపక్షాలు క్రాప్ హాలిడే అనగానే 'అలాంటిదేమీ లేదు, ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు' అని సర్దుకున్న వ్యవసాయ మంత్రి.. ఒక నిర్దిష్టమైన పంటల విధానాన్ని మాత్రం ప్రకటించలేదు. వ్యవసాయశాఖ నుంచి జిల్లాల వారిగా, నేల, తేమ పరిస్థితుల వారీగా సాగురైతుల కోసం శాస్త్రీయ సమాచారం విడుదల కాలేదు. విపక్షాలు ప్రచారం చేస్తున్న క్రాప్ హాలిడే అనే మాటను నమ్మవద్దని చెప్పేందుకు సాగు మంత్రి హడావుడిగా ఏర్పాటు చేసిన సమావేశంలోనూ పంటల నిర్ణయాన్ని రైతులకే వదిలేస్తున్నట్టు మాట్లాడారు.



వెయిట్ లాస్... డబ్బులు లాస్

- మానవ వినియోగానికి కాదనే లేబుళ్లతో ఆన్‌లైన్‌లో అమ్మకం
- ప్రాణాలకే ప్రమాదమని తెలంగాణ డ్రగ్ కంట్రోల్ హెచ్చరిక
- ఆన్ లైన్లో హోరెత్తించే ప్రకటనలు
- మోసపోతున్న వినియోగదారులు
- రెటాట్రూటైడ్', 'ఓర్లిస్టాట్' వంటి అనుమతి లేని మందులను ప్రిఫర్ చేస్తున్న ఆర్ఎంపీ వైద్యులు



హైదరాబాద్ : బరువు తగ్గేందుకు (వెయిట్ లాస్) ప్రజలు ఆన్‌లైన్‌లో లభించే అనుమతి లేని మందులను, ప్రయోగ దశలో ఉన్న పెప్టైడ్ ఉత్పత్తులను వాడవద్దని తెలంగాణ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ప్రామాణికాల సంస్థ (టీజీ సేఫ్) సూచించింది. వాటితో ప్రాణాలకే ప్రమాదమని పేర్కొంది. అనుమతి లేని ఇటువంటి మందులను రోగులకు సూచించినా, విక్రయించినా, అందించినా సంబంధిత వైద్యులపై, ఆన్‌లైన్ నిర్వాహకులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు ఒక ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. రాష్ట్రంలో కొందరు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు (వైద్యులు) బరువు తగ్గించే చికిత్సల కోసం 'రెటాట్రూటైడ్', 'ఓర్లిస్టాట్' వంటి అనుమతి లేని మందులను రోగులకు ఇస్తున్నట్లు టీజీ సేఫ్ దృష్టికి వచ్చింది.



2లో

హర్మూజ్ జలసంధిలో భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఇరాన్ కీలక ప్రకటన చేసింది.
- హర్మూజ్‌లో భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని ప్రకటించింది.

నెతన్యాహును పీఠం నుంచి దించేందుకు అరబ్ పార్టీల ఎత్తుగడ!

- ఇజ్రాయెల్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం
- నెతన్యాహును పీఠం నుంచి దించేందుకు అరబ్‌పార్టీలు సిద్ధమయ్యాయి.
- ఇందుకోసం యూదు పార్టీలకు మద్దతు ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 'తాఅల్' పార్టీ అధినేత అహ్మద్ తీబీ స్పష్టంచేశారు.



2లో

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు



- కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ ఘాటు విమర్శలు
- కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ, బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు
- తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చిందని అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు

2లో

స్మార్ట్ గ్లాసెస్ ధరించి పరీక్షలో చీటింగ్- బెంగళూరు విద్యార్థిపై యూనివర్సిటీ వేటు!



- బెంగళూరులోని మౌంట్ కార్మెల్ యూనివర్సిటీలో స్మార్ట్ గ్లాసెస్ ధరించి పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థి పట్టుబడ్డాడు.
- దీంతో అతడిని డిబార్ చేశారు.

2లో

మిస్ యూనివర్స్ 2026 కిరీటమే లక్ష్యం.. ప్యూర్టోరికో పయనమైన భారత సుందరి కజియా



- ప్యూర్టోరికోలో జరగనున్న 75వ ఎడిషన్ మిస్ యూనివర్స్ 2026 పోటీ
- భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కజియా లిజ్ మెజో
- కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్ గెలిచిన తొలి యువతి
- 19 ఏళ్ల కజియా ప్రస్తుతం న్యాయశాస్త్ర విద్యార్థిని శాస్త్రీయ నృత్యం, సంగీతంలోనూ అపారమైన ప్రతిభ


2లో

ఆర్టీవోలో అవినీతి "చక్రం" తిప్పుతున్న అధికారులు

ఏడాదిలో అనేక సార్లు టూర్లు, విదేశీ ట్రిప్పుల పేరుతో సెలవుల్లో ఉంటూ వచ్చాక తాను నియమించుకున్న ప్రైవేటు సిబ్బందిని ఇన్ని రోజుల కలెక్షన్స్ ఏవని ఒత్తిడి తెస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఆర్టీఏ కార్యాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పాత్ర చాలా కీలకమైనది. కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలనలు, డ్రైవింగ్ పరీక్షలు చుసుకుంటే, కార్యాలయ అంతర్గత పరిపాలన, ఫైళ్ల నిర్వహణ, సిబ్బంది పర్యవేక్షణ అంతా ఏఓ పరిధిలోనే ఉంటుం ది.

ఏ సెక్షన్‌లో ఏ ఫైల్ ఆగిపోయింది? ఏ అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి? వాటిని ఆయనే పరిశీలిస్తారు. వాహన రిజిస్ట్రేషన్లు, లైసెన్సుల జారీ, పర్మిట్లు వంటి విభాగానికి సంబంధించిన రికార్డులను భద్రపరచడం వంటి కార్యకలాపాలకు ఏఓ అధికారులే జవాబుదారిగా ఉండాల్సి ఉంటుంది. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులు, లైఫ్‌టాక్స్, చలానాలు ఇతర జరిమానాల రూపంలో వచ్చే ప్రభుత్వ ఆదాయాన్ని, లెక్కలను ఏఓనే పర్యవేక్షిస్తారు.

రోజువారీ వసూలైన నగదు సక్రమంగా ప్రభుత్వ ఖాతాకు జమ అవుతుందో లేదో అకౌంట్స్ విభాగంతో ఆయన పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మొత్తం అంశాలన్నింటినీ ఆర్టీఓలకు నివేదికలు



ఇవ్వాల్సి ఉంటుంది.

కార్యాలయాలకు సంబంధించిన ప్రగతి నివేదికలు, కోర్టు కేసుల వివరాలు, ప్రభుత్వానికి పంపాల్సిన నివేదికను సమయానికి ఆర్టీఓ ఆమోదానికి పంపాల్సి ఉంటుంది. ఇంతటి కీలకమైన బాధ్యతల్లో ఉన్న ఆ అధికారులు ఆర్టీఓలను సైతం పక్కదారి పట్టిస్తూ తమ చేతివాటం చూపిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా సీసీలు జారీ:

సీసీలు, ఎన్ఓసీలు జారీ చేయడం, వాటిని రద్దు చేయడంలో వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆర్‌సీలు లేని వాహనాలను ఇతర వ్యక్తుల పేర్లపైకి మార్చడంలో వేలాది రూపాయలు దండుకుంటున్నారు.

రెండేండ్ల కిందట ఓ వాహనదారుడు సదరు కార్యాలయం నుంచి ఇతర రాష్ట్రానికి తీసుకున్న ఎన్ఓసీని ఇటీవల వెనక్కి తీసుకొచ్చాడు. అయితే ఆ ఎన్ఓసీని క్లియర్ చేయడం కోసం ప్రభుత్వం రుసుంతో పాటు అదనంగా డబ్బులు ముట్టజెబితేనే ఎన్ఓసీ క్లియర్ చేసినట్టు బాధితుడు వివరించాడు. సీసీ(క్లియరెన్స్ సర్టిఫికెట్) జారీ చేయడంలోనూ ఏఓలు నిబంధనలకు విరుద్ధంగా చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలున్నాయి.

రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్‌ల్లోని చాలా కార్యాలయాల్లో ఏఓలు పారదర్శక సేవలు అందిస్తున్నప్పటికీ కొందరి ఏఓల చేష్టలతో ఆర్టీఏకు చెడ్డపేరు వస్తుండటం గమనార్హం.

నమ్మకు.. నమ్మకు సర్కారును!!!

ఎల్ నినో పరిస్థితులను వివరించేందుకు అక్టోబర్ 23 న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులతో జరిపిన ప్రత్యేక సమావేశంలో రబీలో పంటలకు చుక్క నీరు లభించదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 30 లక్షల పంపు సెట్లలో ఇప్పటికే 15 లక్షలు ఎండిపోయాయి.

ప్రజలు నీరు, కరెంటు వాడకం విషయంలో కఠినమైన పొదుపు నిబంధనలు పాటించాలని సలహా ఇచ్చారు. నవంబర్ నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు రైతులు వీటి విషయంలో ప్రభుత్వంపై ఎలాంటి ఆశలు పెట్టుకోవద్దని తేల్చిచెప్పారు. ఇదే విషయాన్ని ప్రజలకు సావధానంగా వివరించాలని పార్టీ నేతలకు సూచించారు. నీరు, కరెంటు దొరకదని ముఖ్యమంత్రి అంటే, మీకు తోచిన పంటలు వేసుకోండని వ్యవసాయ మంత్రి ఉచిత సలహా ఇచ్చారు. క్రాప్ హాలిడే అంటే ఇంతకన్నా ఇంకేమి ఉంటుంది?

ఎల్ నినో ప్రభావం దుర్భిక్ష నివారణ చర్యలపై ప్రభుత్వం అక్టోబర్ 28న నిర్వహించిన అఖిల పక్ష సమావేశానికి ముఖ్యమంత్రి గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్రంలోని కరువు పరిస్థితులను పరిశీలించేందుకు ఓ నిపుణుల కమిటీ వేస్తామన్నారు. ఆ నివేదికను కేంద్రానికి పంపి సాయం కోరుతామన్నారు.

ఇప్పటికే కరువు మీద పడి ప్రజలు అల్లాడుతుండగా ప్రభుత్వం మాత్రం ఇంకా కమిటీలు వేసే స్థాయిలోనే ఉన్నది. ఇంతటి కీలకమైన సమావేశం ముఖ్యమంత్రి లేకుండా ఎలాంటి పకడ్బందీ నిర్ణయాలు తీసుకోకుండా ముగిసిందని పత్రికల్లో వచ్చింది. కరువు నివారణ పట్ల ప్రభుత్వం హాలిడే తీసుకుందనడానికి ఇంకేం రుజువులు కావాలి? ప్రభుత్వం క్రాప్ హాలిడే నోటితో ప్రకటించకున్నా రాష్ట్రంలో రబీ పంట పరిస్థితులు హాలిడేనే తలపిస్తున్నాయి. నీరు, కరెంటు ఇవ్వం, వీటిపై ఆశ పడకుండా ఏదైనా పంటలు వేసుకోండి అంటే అర్థమేమిటి? ఈసారి చలికాలమే ఉండదని, భూమిపై వేడి మామూలు కన్నా ఎక్కువ ఉంటుందని చెప్తూ నష్టం రాకుండా జాగ్రత్త పడండని సాగుదారులకు చెబుతుంటే ప్రభుత్వ అలసత్వం తెలిసిపోతున్నది. తేమ అసలే లేని నేలపై విత్తనం మొలకెత్తదు. ఆరుతడి పంటలకైనా బావిలోంచి నీళ్లు కొన్ని అయినా రావాలి. భూతాపాన్ని నీటి లభ్యత కొరవడితే మోటర్లు కాలిపోతాయి. ఈ పరిస్థితి ఈ ఖరీఫ్‌లోనే రైతులు ఎదుర్కొన్నారు.

నీరు, కరెంటు ఇవ్వలేని పరిస్థిత్తుల్లో పంటకు సెలవు ప్రకటించి పండించుకునే అవకాశం ఉన్న రైతులకు తగిన సూచనలివ్వాలి. తుఫానులు, అల్పపీడనాల వల్ల జూలైలో, ఆ తర్వాత వర్షాలు జోరుగానే పడ్డాయి. మొత్తానికి ఈ సీజన్‌లో మన రాష్ట్రంలో వర్షపాత లోటు 17 శాతం మాత్రమే.

ఇలాంటి లోట్లు గతంలో ఉన్నవే. 17% కన్నా ఎక్కువ లోటు వర్షం ఉన్నప్పుడు కూడా రైతులు రిజర్వాయర్లలో నిలువ ఉన్న నీళ్లతో మంచి పంటలు తీశారు. క్రాప్ హాలిడే అంటే జూలైలో పడిన వర్షపు నీళ్లు ఎటు వెళ్లాయి అనే ప్రశ్నకు జవాబు చెప్పవలసి వస్తుందని ప్రభుత్వం ముఖం చాటేస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారంతో రాజకీయంగా వాడుకుంటున్నది. ఎల్ నినో వచ్చి కాంగ్రెస్ పాలనా డొల్లతనాన్ని బయటపెట్టింది.

ప్రకృతి పరీక్షలు కాంగ్రెస్ సర్కార్ అసలు రంగు బయట పడింది. ప్రాజెక్టుల ద్వారా వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటే ఎల్ నినో ప్రభావం రాష్ట్ర ప్రజలపై తక్కువగా ఉండేది. కరువును ఎదుర్కొనేందుకు రూ. 2 వేల కోట్లతో ప్రణాళికలు అమలు చేసి ఉంటే, ఇప్పుడు రూ. 20 వేల కోట్ల పంట ఎండిపోయేది కాదు. క్రాప్ హాలిడే ప్రకటనే అవసరమయ్యేది కాదు.

రబీ సంగతేమో గానీ ఇప్పటికే యాసంగి పంట 11.18 లక్షల ఎకరాల్లో పూర్తిగా ఎండిపోయిందని లెక్కలు చెప్తున్నాయి. ప్రభుత్వం అంచనా ప్రకారం రాష్ట్రంలోని సగం అనగా 320 మండలాల్లో ఎల్ నినో ప్రభావం ఉన్నది. వాటిలోని 120 లో కరువు తీవ్రత అధికంగా ఉన్నది. ఖరీఫ్‌లో రాష్ట్రంలోని 126 లక్షల ఎకరాల్లో నీటి కొరత వల్ల 30 % పంట మార్పిడి జరిగింది. 25 % మేరకు నేలలో సాగు చేపట్టలేదు. రబీలో సుమారు 64 లక్షల ఎకరాల్లో సాగు సాగదు. దానితో వ్యవసాయ కూలీలకు పని దొరుకదు. పశువుల గ్రాసం ఉండదు. పంట వేయక ఆదాయం కోల్పోయినవారి నష్టాన్ని కూడా లెక్కించాలి. ఇలాంటి ఎన్నో అత్యవసర పనుల పట్ల పట్టింపులేని ప్రభుత్వ వైఖరి చూస్తుంటే అది పాలనకే హాలిడే ప్రకటించినట్టుంది.

వెయిట్ లాస్... డబ్బులు లాస్

అలాగే టెలిగ్రామ్, సోషల్ మీడియా, కొన్ని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రజలు, హెల్త్‌కేర్ సిబ్బంది 'రెటాట్రూటైడ్', 'టెసామోరెలిన్' వంటి పెప్టైడ్‌లతో పాటు బీపీసీ-157, జీహెచ్‌కే-సీయూ వంటి నాసిరకం ప్రయోగ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆన్‌లైన్ సంస్థలు సద రు ఉత్పత్తులపై పరిశోధన రసాయనాలు (రీసెర్చ్ కెమికల్స్), మానవ వినియోగానికి కాదనే లేబుళ్లు వేసి విక్రయిస్తున్నప్పటికీ.. వాటితో పాటే మందులను స్వయంగా డోసేజ్ చేసుకునేలా ఇంజెక్షన్ వైల్స్, గైడ్ పుస్తకాలను పంపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆన్‌లైన్ లేదా చట్టవిరుద్ధ వనరుల నుంచి లభించే ఈ ఇంజెక్షన్ ఉత్పత్తులు ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు, స్టెరిలిటీ పరీక్షలు దాటి రావు. ఇవి వాడటం వల్ల శరీరంలో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, ఇతర సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ, తప్పుడు లేబుళ్లు ఉన్న ఉత్పత్తులను విక్రయిస్తున్నారు లేబుల్ పైన ఉన్న వివరాలకు, వైల్ లోపల ఉన్న మందుకు ఎలాంటి నం బంధం ఉండటంలేదు. ఇలాంటి ఇంజెక్షన్లను వైద్యు ల పర్యవేక్షణ లేకుండా సొంతంగా ఆన్‌లైన్ సూచనలతో వేసుకోవడం వల్ల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని టీజీ సీఫ్ హెచ్చరించింది. సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్(సీడెస్కో), టీజీ సేఫ్ అనుమతులు లేని ఎలాంటి వెయిట్ లాస్ మందులను రోగులకు ప్రిస్క్రిప్షన్‌లో రాయకూడదు, విక్రయించకూడదు. మానవ వినియోగానికి కాదు అన్న ఉత్పత్తులను ఔషధాలుగా పరిగణించరాదు. డ్రగ్స్ అండ్ కాస్మాటిక్స్ యాక్ట్, 1940 నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాగా బరువు తగ్గడం లేదా ఊబకాయం నివారణ కోసం తప్పనిసరిగా అర్హత కలిగిన సంబంధిత వైద్యులను మాత్రమే సంప్రదించాలని, అనుమతి పొందిన ఫార్మసీల ద్వారానే మందులు పొందాలని ప్రజలకు టీజీ సేఫ్ విజ్ఞప్తి చేసింది. అనుమతి లేని నాసిరకం ఔషధాలు, ఆన్‌లైన్ విక్రయాలు, చట్టవిరుద్ధ ఔషధాల గురించి తెలిస్తే టీజీ సేఫ్ డ్రగ్ వింగ్ టోల్‌ఫ్రీ నంబరు 1800-599- 6969కు ఫిర్యాదు చేయవచ్చని సూచించింది. అయినా ఇంకా మోసపోతూనే ఉన్నారు వినియోగదారులు...పోయి పోయి తమ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

హర్మూజ్ జలసంధిలో భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు

హర్మూజ్ జలసంధిలో తాము విధించిన ఆంక్షల నుంచి భారత నౌకలకు మినహాయింపులు కల్పించినట్లు ఇరాన్ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఆ జలసంధిలో భారత నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని తెలిపింది. భారత్‌తో పాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాల నౌకలకు ఈ రవాణా నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్‌లోని జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అహ్మద్ హయత్ మొఘద్దమ్ వ్యాఖ్యానించారు.

"హర్మూజ్ జలసంధిలో రవాణా విషయానికి వస్తే మేము ఇప్పటికే నాలుగు దేశాలకు (భారత్, చైనా, ఇరాక్, ఖతార్) మినహాయింపులు ఇచ్చాం. అంటే మా కోణంలో వారు స్వేచ్ఛగా హర్మూజ్ గుండా రాకపోకలు సాగించవచ్చు.

అమెరికాకు ఆయా దేశాలు ఈ జలసంధి గుండా ప్రయాణించడంపై ఎలాంటి సమస్యలు లేవు. ఈ నాలుగు దేశాల నౌకలు హర్మూజ్ జలసంధి గుండా స్వేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. నిజానికి మేము వ్యాపారం చేస్తున్నాం కదా!. భారత నౌకలకు హర్మూజ్‌లో ఆంక్షల నుంచి ఈ మినహాయింపు ఇవ్వడం ద్వారా మేము వారి నుంచి మందులను దిగుమతి చేసుకుంటున్నాం. అలాగే చైనాకు ఈ వెసులుబాటు కల్పించడం ద్వారా వారి నుంచి రాజకీయ మద్దతు పొందుతున్నాం. అంతేకాకుండా వారి నుంచి మాకు ఆర్థిక చెల్లింపులు కూడా అందుతున్నాయి." అని అహ్మద్ హయత్ మొఘద్దమ్ పేర్కొన్నారు.

ఓ అంతర్జాతీయ మీడియా కథనం ప్రకారం

అమెరికాతో ప్రత్యక్ష యుద్ధ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి ఖతార్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని పరిశీలించాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలిబాఫ్ సహా పలువురు రాజకీయ నాయకులు తమ దేశ సైనిక నాయకత్వానికి కోరుతున్నారు. అమెరికాతో ప్రత్యక్ష యుద్ధం మళ్లీ జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఇరాన్ అంతర్గత అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ సీనియర్ రాజకీయ నాయకులు దౌత్యపరమైన పరిష్కారం కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇరాన్ రాజకీయ నాయకులు దౌత్య మార్గాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తుంటే, ఆ దేశ సైనిక వ్యూహకర్తలు మాత్రం మరోలా ఆలోచిస్తున్నారు. అమెరికా దళాలతో మళ్లీ ప్రత్యక్ష ఘర్షణకు దిగడమే రాబోయే రోజుల్లో ప్రధాన పరిణామం కానుందని వారు భావిస్తున్నారు.

యుద్ధానికి సన్నద్ధమవుతున్న ఇరాన్

ఓవైపు చర్చలకు సిద్ధమవుతూనే, మరోవైపు యుద్ధానికీ ఇరాన్ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 10 లక్షల మంది యుద్ధ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు మరో సైనిక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. అమెరికా అణు బాంబు వేస్తుందేమోనని అనుమానిస్తున్న ఇరాన్ అందుకు ప్రజలను సన్నద్ధం చేస్తోంది. ఒకవేళ అణు దాడి జరిగితే ఎలా తప్పించుకోవాలో పేర్కొంటూ ఒక వీడియోను సైతం రిలీజ్ చేసింది. షెల్టర్లలోకి వెళ్లాలని, బయటి నుంచి గాలి చొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రేడియోధార్మికత నుంచి దూరంగా వెళ్లిపోవాలని ఆ వీడియోలో పేర్కొంది.

యూఎస్ ఎన్నికలపై ఇరాన్ సెటైర్లు

ఇదిలా ఉండగా, అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగలడంపై ఇరాన్ స్పందించింది. ఈ ఎన్నికల ద్వారా అమెరికా ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించినట్లు స్పష్టమైందని పేర్కొంది. ఓటర్ల తీర్పు యుద్ధానికి వ్యతిరేకంగా వెలువడిందని తెలిపింది. అమెరికన్లు యుద్ధానికి 'నో' చెప్పారని, తాము ఈ సందేశాన్ని సమర్థిస్తున్నామని స్పష్టం చేసింది. అయితే అమెరికా ప్రభుత్వం తన ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘలిబాఫ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

ఇరాన్‌పై దాడులకు విరుచుకుపడ్డ అమెరికా

మరోవైపు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర రూపం దాల్చుతున్నాయి. కొన్ని వారాల విరామం తర్వాత ఇరాన్‌పై అమెరికా సోమవారం దాడులు చేసింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఖేష్మ్ దీవిపై అమెరికా సైన్యం విరుచుకుపడింది. అయితే ఆత్మరక్షణ కోసమే ఈ దాడులు చేసినట్లు అగ్రరాజ్యం చెప్పుకొచ్చింది. మరోవైపు, ఇరాన్‌లోని ఖేష్మ్ దీవిపంలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు అక్కడి ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది.

నెతన్యాహును పీఠం నుంచి దించేందుకు అరబ్ పార్టీల ఎత్తుగడ!

ఇజ్రాయెల్‌లో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పార్టీకి గానీ, ఆయన ప్రత్యర్థి ఐసన్‌కోట్ పార్టీకి గానీ పూర్తి మెజారిటీ లభించలేదు. ఈ నేపథ్యంలో అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ప్రయత్నాలు మొదలుపెట్టారు. దేశంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వీలుగా పార్లమెంటుకు ఎన్నికైన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చలు, సంప్రదింపులు ప్రారంభించనున్నట్లు బుధవారం ప్రకటించారు.

ప్రభుత్వ ఏర్పాటుకు ఇరు పక్షాల మధ్య తీవ్ర చర్చలు

మరోవైపు, దేశంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి చిన్న పార్టీలను ఏకం చేసేందుకు ఇరు పక్షాలు తీవ్రమైన చర్చలు జరుపుతున్నాయి. ఈ క్రమంలో నెతన్యాహును పీఠం నుంచి దించేందుకు అరబ్ పార్టీలు సిద్ధమయ్యాయి. ఇందుకోసం యూదు పార్టీలకు మద్దతు ఇచ్చేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 'తాఅల్' పార్టీ అధినేత అహ్మద్ తీబీ స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు నెతన్యాహుకు మెజారిటీ ప్రజల మద్దతు లేదని తేటతెల్లం చేశాయని తీబీ పేర్కొన్నారు. తమపై రోజువారీగా దాడులు, వివక్ష చూపిస్తున్న ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా అరబ్ సమాజం ఆత్మరక్షణ కోసం బారులు తీరి ఓటేసిందని ఆయన అన్నారు. నెతన్యాహును ఓడించడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు.

ఇజ్రాయెల్ కేవలం యూదులకు మాత్రమే!

ప్రతిపక్ష నేతగా ఉన్న గాడి ఐసన్‌కోట్ అరబ్ పార్టీల మద్దతును తిరస్కరిస్తే, ఇజ్రాయెల్ కేవలం యూదులకు మాత్రమే పరిమితమైన ప్రజాస్వామ్య దేశంగా మిగిలిపోతుందని తీబీ విమర్శించారు. ఐసన్‌కోట్ నేతృత్వంలోని ప్రభుత్వం వస్తే వెంటనే పశ్చిమాసియాలో శాంతి లేదా రెండు దేశాల పరిష్కారం వచ్చేస్తుందని తమకు ఎలాంటి భ్రమలు లేవని చెప్పారు. అయితే, గడిచిన నాలుగేళ్లుగా తీవ్ర రైట్ వింగ్ భావజాలంతో పాలించిన నెతన్యాహు కూటమి కంటే ఇది ఎంతో మెరుగైనదని చెప్పారు. దేశ జనాభాలో 21 శాతం ఉన్న అరబ్ పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆ షరతులు వర్తించవు

కాగా, మొత్తం 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంటు కెన్నెసెట్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో నెతన్యాహు నేతృత్వంలోని రైట్ వింగ్ కూటమికి 53 సీట్లు వచ్చాయి. గాడి ఐసన్‌కోట్ నేతృత్వంలోని కూటమికి 48 సీట్లు దక్కాయి. అరబ్ పార్టీలు 19 సీట్లు సాధించాయి. ఇజ్రాయెల్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు 61 సీట్లు కావాల్సి ఉంటుంది. ఐసన్‌కోట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్న వేళ, అరబ్ పార్టీలు ప్రభుత్వంలో నేరుగా చేరకుండా బయటి నుంచి మద్దతు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నాయి. అయితే, ఐసన్‌కోట్ కొన్ని షరతులు విధించడంపై స్పందిస్తూ, బయటి నుంచి మద్దతు ఇచ్చే తమలాంటి పార్టీలకు ఈ షరతులు వర్తించవని తీబీ స్పష్టం చేశారు. అలాగే, 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిని, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ చేసిన సైనిక చర్యను రెండింటినీ తీబీ ఖండించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇజ్రాయెల్ రాజకీయాన్ని ఏ మలుపు తిప్పుతాయోనని ఆసక్తి నెలకొంది.

ఓట్ల లెక్కింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదు

ఇదిలా ఉండగా, గతవారం ఇజ్రాయెల్‌లో ముగిసిన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆ దేశ ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

అరబ్ పార్టీలు విదేశీ సహాయంతో ఎన్నికల ఫలితాలను చోరీ చేశాయని నెతన్యాహు, ఆయన మద్దతుదారులు చేసిన ఆరోపణల్లో ఎటువంటి నిజం లేదని తేల్చి చెప్పింది. ఎన్నికల సమగ్రతను దెబ్బతీసేలా లేదా ఫలితాలను ప్రభావితం చేసేలా ఎలాంటి అక్రమాలు జరిగినట్లు తనిఖీల్లో ఆధారాలు లభించలేదని ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతి ఫిర్యాదును వ్యక్తిగతంగా, క్షుణ్ణంగా పరిశీలించామని, అయితే ఎన్నికల ఫలితాలు చెల్లవని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు దొరకలేదని ఎన్నికల కమిషన్ తాత్కాలిక డైరెక్టర్ డీన్ లివ్నే స్పష్టం చేశారు.

ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారు: కేటీఆర్ ఘాటు విమర్శలు

కాంగ్రెస్, బీజేపీ రెండూ తెలంగాణకు అన్యాయం చేస్తున్న పార్టీలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీ నాయకుల ముందు రాష్ట్ర నేతలు వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సంచులు మోసే పార్టీ అయితే.. బీజేపీ చెప్పులు మోసే పార్టీ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమిత్ షా హైదరాబాద్‌కు వస్తే బండి సంజయ్ బాడీగార్డ్‌లా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. ప్రియాంక గాంధీ భద్రతా సిబ్బంది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పక్కకు నెట్టేశారని ఆరోపించారు. కేంద్ర మంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ కరీంనగర్ ప్రజల గౌరవాన్ని దిగజార్చవద్దని హితవు పలికారు. తనకంటే చిన్నవాడైన అమిత్ షాకు రాంచందర్‌రావు కాళ్లకు నమస్కరించడమేంటని ప్రశ్నించారు.

అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారని, రాష్ట్రానికి ఏం ఇచ్చారని కేటీఆర్ నిలదీశారు. ఒక్క మెట్రో ప్రాజెక్టు, జాతీయ ప్రాజెక్టు లేదా విద్యాసంస్థనైనా మంజూరు చేశారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తూ రాజకీయ ప్రయోజనాల కోసమే తాపత్రయపడుతున్నారని విమర్శించారు. వారానికి రెండుసార్లు ఢిల్లీకి వెళుతూ ఆయన 'ఈఎంఐ ముఖ్యమంత్రి'గా మారిపోయారని ఎద్దేవా చేశారు. అడవులు నరికే వీరప్పన్‌ను అటవీశాఖ మంత్రిని చేసినట్లుగా.. భూములు అమ్మే బ్రోకర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఎలా ఉంటుందో అలా ఉందని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

స్మార్ట్ గ్లాసెస్ ధరించి పరీక్షలో చీటింగ్- బెంగళూరు విద్యార్థిపై యూనివర్సిటీ వేటు!

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణ కూడా విద్యా సంస్థలకు సవాలుగా మారుతోంది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అత్యాధునిక పరికరాలను వాడుతుండటం ప్రస్తుత కాలంలో విద్యా రంగంలో తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తోంది. ఇలానే ఇప్పుడు బెంగళూరులోని మౌంట్ కార్మెల్ యూనివర్సిటీలో ఒక విద్యార్థి స్మార్ట్ గ్లాసెస్ ధరించి సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యాడు. నిబంధనలకు విరుద్ధంగా కాపీ కొడుతూ దొరికిపోయిన ఫస్ట్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థిపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకుంది. ఇన్విజిలేటర్ అతడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో, సదరు విద్యార్థిని మిగిలిన సెమిస్టర్ పరీక్షలు రాయకుండా యూనివర్సిటీ బహిష్కరించింది. పెండింగ్ పరీక్షల్ని రాబోయే మూడో సెమిస్టర్ సమయంలో రాసుకోవడానికి అతడికి అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు.ఆ

మిస్ యూనివర్స్ 2026 కిరీటమే లక్ష్యం.. ఫ్యూర్టోరికో పయనమైన భారత సుందరి కజియా

75వ మిస్ యూనివర్స్ పోటీల్లో విశ్వ వేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగరేసేందుకు 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' విజేత కజియా లిజ్ మెజో ఫ్యూర్టోరికో బయల్దేరి వెళ్లింది. కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా, ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు భారత్ తరపున ప్రాతినిధ్యం వహించనుంది. కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా టైటిల్ గెలుచుకున్న తొలి యువతిగా ఆమె ఇప్పటికే చరిత్ర సృష్టించింది. బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆమె ఫ్యూర్టోరికా పయనమైంది. ఈ సందర్భంగా మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. మెరూన్ రంగు చీరలో, తలపై కిరీటంతో, మెడలో భారీ నెక్లెస్‌తో సంప్రదాయబద్ధంగా ముస్తాబై కజియా ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించింది. భారత జాతీయ జెండాను చేతబట్టి ఆమె ఇచ్చిన ఫోజులు దేశ ప్రజల ఆశలను, ఆకాంక్షలను ప్రతిబింబించాయి.

"ఒక రాణి కిరీటాన్ని మాత్రమే కాదు, ఒక దేశపు కలలు, ఆశలను కూడా మోసుకెళుతుంది. సంప్రదాయంతో, పేరుప్రతిష్ఠలతో కజియా తన ప్రయాణాన్ని ప్రారంభిస్తోంది" అని మిస్ యూనివర్స్ ఇండియా సంస్థ ఒక సందేశాన్ని పోస్ట్ చేసింది. ఈ పోస్ట్‌కు 'డిస్కవర్ ఫ్యూర్టోరికో' స్పందిస్తూ ఆమెకు స్వాగతం పలికింది. 2007లో జన్మించిన కజియా, తన బాల్యాన్ని అబుదాబిలో గడిపింది.వ. 17 ఏళ్ల వయసులోనే 'మిస్ టీన్ దివా 2024' టైటిల్‌ను, 'మిస్ టీన్ ఇంటర్నేషనల్ 2025'లో ఫస్ట్ రన్నరప్‌గా నిలిచి తన ప్రతిభను చాటుకుంది. మోడలింగ్‌తో పాటు

సైబర్ నేరాలపై విద్యార్థులు

అప్రమత్తంగా ఉండాలి





-మహేశ్వర మెడికల్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి



సమస్త ప్రక్షాళనంపటాన్చెరు:డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ ఇతరులకు జరిగే మోసాలను వివరించాలని సైబర్ సెల్ డిఎస్పి వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సైబర్ జాగృకత దివస్ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా బుధవారం ఇస్నాపూర్‌లోని మహేశ్వర మెడికల్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర డీజీపీ సివి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి బుధవారం సైబర్ జాగృకత దివస్ నిర్వహిస్తూ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు ప్రజల అవసరాలు, అత్యాశ, భయాన్ని ఆసరాగా చేసుకొని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు సైతం సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు అధికారులమని ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి బ్యాంకింగ్ వివరాలు వెల్లడించవద్దని తెలిపారు. భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాల ద్వారా జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు, లోన్ యాప్ మోసాలు, ఇతరుల పేరుతో చేసే ఇంపర్సనేషన్ మోసాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు సైతం సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా ఎఎఎ.ఎఎఎవతీఎతీఅఎవ.స్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, సైబర్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలసదన్‌లో బాలలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించిన సివిల్ జడ్జి సౌజన్య

సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి :జాతీయ న్యాయ సేవా దినోత్సవం వారోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సంగారెడ్డిలోని బాలసదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి. సౌజన్య న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బి. సౌజన్య మాట్లాడుతూ... ప్రతి బాలుడు, బాలికకు సమాన హక్కులు, గౌరవం, రక్షణ, నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందని తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందని వివరించారు. బాలల హక్కులు, వాటి పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నిషేధం, బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాలలపై జరిగే శారీరక, మానసిక వేధింపులు, వాటి నివారణ, విద్యా హక్కు, బాలల సమగ్ర అభివృద్ధి, బాలల అక్రమ రవాణా, దోపిడీ, ఇతర అసాంఘిక



కార్యకలాపాల నుంచి రక్షణ, బాలలు ఎదుర్కొనే సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసే విధానం, ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిల్లలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని, ఎలాంటి వేధింపులు లేదా అన్యాయం జరిగినా భయపడకుండా సంబంధిత అధికారులకు, ఉపాధ్యాయులకు లేదా బాలల సంరక్షణ అధికారులకు తెలియజేయాలని సూచించారు. అంతేకాకుండా, బాలసదన్‌లోని చిన్నారులకు న్యాయపరమైన సహాయం అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమాజంలో బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా బాలలకు చట్టాలపై అవగాహన కల్పించడం, న్యాయం అందరికీ చేరువ చేయడం, ఉచిత న్యాయ సేవలపై చైతన్యం పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

నేలను కాపాడుకోవాలి ఆరుతడి పంటలు సాగు చేయాలి

మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



సమస్త ప్రక్షాళనం కొల్చారం: మండలంలోని పైతర గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి ఆధ్వర్యంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన జొన్న, మొక్కజొన్న, కుసుమ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని కాపాడుకోవాలని, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటిస్తూ నేల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, ఏఈఓ అమృత, ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యాసంగి సీజన్ లో వరి పంట కు బదులుగా ప్రత్యామ్నాయ వేసుకోవాలి -వ్యవసాయధికారి శ్రీదేవి



సమస్త ప్రక్షాళనం ,రేగోడు :- ప్రస్తుతం నెలకొన్న ఎల్ ని నో పరిస్థితుల దృష్ట్యా,నెల మరియు నీటి సంరక్షణ,వాతావరణం మార్పులను తట్టుకునే వ్యవసాయం మరియు సుస్థిర వ్యవసాయం పద్ధతుల గురించి రైతులు యాసంగి సీజన్ లో వరి పంట కు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు నూనె గింజలు పప్పుదినుసులు , జొన్న సాగు పంట మార్పిడిని, పాటించాలని, వ్యవసాయ అధికారి శ్రీదేవి సూచించారు.మండలం లోని గజ్వాడ పంచాయతీ కార్యాలయంలోవ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ (కే బి ఏ)కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించడం,సమతుల్య ఎరువుల యాజమాన్యం, పంట అవశేషాల నిర్వహణ , సహజ వ్యవసాయం పంటల దిగుబడి పెంపు, నీటి సంరక్షణ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలపై అన్నదాతలకు అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పి సి సి చైర్ పర్సన్ శ్రీ కిషన్, గ్రామ ఉపసర్పంచ్ గంగన్న, పంచాయతీ సెక్రటరీ రమేష్ , వ్యవసాయ విస్తరణ అధికారిని అంబిక, వ్యవసాయ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

వేక పరిశ్రమ సహకారంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ



సమస్త ప్రక్షాళనం హత్నూర సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని సాధుల్ నగర్ గ్రామంలో వేక పరిశ్రమ సహకారంతో సిఎస్ఆర్ ఫండ్ ఐదు లక్షల రూపాయల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సర్పంచ్ లక్ష్మీ కృష్ణ,ఉప సర్పంచ్ పల్లవి ప్రసాద్ ముదిరాజ్, భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సి ఎస్ ఆర్ నిధులు మంజూరుకు కృషిచేసిన నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డికి వేక పరిశ్రమ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పరిశ్రమల సహకారంతో గ్రామాలు అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అంతేకాకుండా గ్రామంలో సిసి రోడ్లు వీధి దీపాలు తాగునీటి సౌకర్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అధికారుల సలహా సూచనలతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కరువు

-బి ఆర్ఎస్ నాయకుడు బాలయ్య



సమస్త ప్రక్షాళనం,రేగోడు :-రేగోడు ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ లేకుండా పోయిందని మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు సిహెచ్ బాలయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు వద్ద కొడుకుతో కలిసి భద్రాచలం వెళ్లే బస్సు ఎక్కిన అశ్వాపురం మండలం మిట్టగూడెంకు చెందిన మౌనిక అనే మహిళ కొడుకుకు టికెట్ ఇవ్వమని రూ. 100 ఇవ్వగా, రూ. 10 టికెట్ జారీ చేసి, మిగతా చిల్లరను టికెట్ వెనుక రాసిన కండక్టర్ ప్రవళిక కు తనకు చిల్లర ఇప్పుడే కావాలని కండక్టర్‌తో వాగ్వాదానికి దిగి, ఆమెను బస్సు నుంచి కిందకు తోసి వేయడం తో కండక్టర్ ప్రవళిక బస్సు వెనుక టైర్ల కింద పడి రెండు కాళ్లు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన మహిళా కండక్టర్ ప్రవళిక కు న్యాయం చెయ్యాలని డిమాండ్ చేసారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహాలక్ష్మి పథకం లో భాగంగా మహిళలకు తెలంగాణ రాష్ట్రంలో ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడం తో మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణాలు చేస్తున్న సందర్భంగా బస్సులో డ్రైవర్ కండక్టర్లకు బస్సులో ప్రయాణించే మహిళలు ఆర్టీసీ ఉద్యోగులకు బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణగా నిలవాలని చనిపోయిన కండక్టర్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

శంశోద్దీన్ పూర్ లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సమస్త ప్రక్షాళనర్ రాయికోడ్:రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం శంశోద్దీన్ పూర్ గ్రామంలో ఉప సర్పంచ్ తుకారాం,జీపిఓ మల్లేశం,డీలర్ రవీందర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ప్రకాష్,తాండూర్ వెంకటేష్,బాలాజీ సంతోష్ లు హాజరై వారి చేతుల మీదుగా లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని,రాష్ట్రంలో ఏ ఒకరు ఆకలితో అలమట్టించకూడదనీ,ఆకలితో ఉపవాసం ఉండకూడదనే ఉద్దేశ్యంతో అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డుతో పాటు సన్న బియ్యం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు,నాయకులు పీరరెడ్డి,శ్రీను శాంతం,డేవిడ్, ప్రకాష్,నరేందర్,అశోక్,శేఖర్,అశోక్,లబ్దిదారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

-11మంది అరెస్ట్



సమస్త ప్రక్షాళనం రాయికోడ్:మండల పరిధిలో పేకాట కార్యకలాపాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.ఇందులో భాగంగా మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని షాపూర్,పాంపాడ్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై పోలీసులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.దాడుల్లో పేకాట ఆడుతున్న షాపూర్ గ్రామ శివారులో ఆరుగురిని,పాంపాడ్ గ్రామ శివారులో ఐదు మందిని మొత్తం11 మంది పేకాట రాయుళ్ళని పోలీసులు అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి మొత్తం నగదు రూ.12,010,పది మొబైల్ ఫోన్లు,పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టడం జరిగింది.ఈ సందర్భంగా రాయికోడ్ ఎస్‌హెచ్‌ఓ యం.చైతన్య కిరణ్ మాట్లాడుతూ...మండల పరిధిలో ఎక్కడైనా పేకాట,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని,ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపైనే కాకుండా వాటికి సహకరించే వారిపై కూడా చట్టంప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మండల ప్రజలు పేకాట,ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని,ఇలాంటి కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.

రైతుబంధు నిధులు ఇంకా విడుదల కాలేదు

-రైతులు అపోహలకు గురికావద్దు

-మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి



సమస్త ప్రక్షాళనంరేగోడు :-రైతు భరోసా డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు బుధవారం నాడు వచ్చిన మెసేజ్ లు రైతులకు అయోమయానికి గురిచేశాయి. మండలంలోని చాలామంది రైతులకు ఎకరాకు 12000 చొప్పున జమ చేసినట్లు మెసేజ్లు వచ్చాయి. ముఖ్యమంత్రి పేరుతో మెసేజ్ రావడం తో రైతులు తమ బ్యాంకు ఖాతాలో జమ జబ్బులను పరిశీలించుకున్నారు. డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదని తెలుసుకొన్న రైతులు ఆందోళనతో వాట్సాప్ మెసేజ్ లకు షేర్ చేశారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి సాంకేతిక లోపం కారణంగా డబ్బులు జమ అయినట్లు మెసేజ్ వచ్చాయని తెలిపారు. రైతులు ఎలాంటి అపోహలకు గురి కావద్దని అన్నారు.రైతు భరోసా నిధులు ఇంకా విడుదల కాలేదని అన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ప్రణయ్, మనస

-ఘనంగా సన్మానించిన నేరేడుగుంట సర్పంచ్ ఒగ్గు సాయి కుమార్ యాదవ్



సమస్త ప్రక్షాళనం అందోల్:రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నేరేడుగుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులు ప్రణయ్, మనసలను బుధవారం నేరేడుగుంట సర్పంచ్ ఒగ్గు సాయి కుమార్ యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... గ్రామంలోని యువత క్రీడా రంగంలో మరింత ముందుకు సాగి ఉన్నత స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా ప్రణయ్, మనసలు అత్యుత్తమ ప్రతిభ కనబరచి గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ప్రోత్సహించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిస్తే ఇద్దరు క్రీడాకారులకు తలా రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతిని అందజేస్తానని ప్రకటించారు. గ్రామంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, యువతకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తూ వారి అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వార్డు సభ్యులు బోయిని శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు వేధింపులు భరించలేక

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మ హత్య



సమస్త ప్రక్షాళనం కొండాపూర్:క్రెడిట్ కార్డులో తీసుకున్న అప్పు చెల్లించలేదని ఆ సంస్థ నుంచి తరచూ ఫోన్ కాల్స్ రావడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాల్వానమరణానికి పడ్డ సంఘటన బుధవారం కొండాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాపూర్ చింతల్ రాఘవేంద్ర నగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు మంగలి వీరేశం (33) క్రెడిట్ కార్డులో తీసుకున్నప్పు చెల్లించకపోవడం తరచూ ఆ సంస్థ నుంచి ఫోన్ కాల్స్ రావడంతో అప్పుల బాధను భరించలేక ఇంట్లో బలవత్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మంగలి రామచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరువు ప్రభావిత రైతుల పంట రుణాల

పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి


-కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్

-ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యలపై ప్రత్యేక డీసీసీ సమావేశం



సమస్త ప్రక్షాళనంసంగారెడ్డి:జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలను పునరుద్ధరించి, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ, డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల వ్యవసాయ పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్, ఆర్బీఐ ఎల్డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. కరువు ప్రభావిత మండలాల్లోని అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రుణాల తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం, తాత్కాలిక వాయిదా సదుపాయం కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ... భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను సక్రమంగా సేకరించి, భద్రపరిచి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు మొత్తం 1,20,065 ఖాతాల ద్వారా రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 2 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు వివరించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ మాత్రమే ఈ ప్రక్రియలో భాగమని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్, వామిస్ విధానాలపై అధికారులకు శిక్షణ



సమస్త ప్రక్షాళనం సంగారెడ్డి:తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పాలనను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ఐఎఫ్ఎంఐఎస్ పరిధిలోని ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్, వర్క్ అకౌంట్స్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, విధానాలపై అధికారులకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నవంబర్ 4న జిల్లా స్థాయి అధికారులకు, నవంబర్ 5న మండల స్థాయి అధికారులకు, నవంబర్ 6న ఇతర డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు)కు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా విధానాల కార్యాచరణ, వినియోగం, అమలు తీరుపై అధికారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటల్ పాలనను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అన్ని శాఖల అధికారులకు ఈ విధానాలపై ఏకరీతి అవగాహన కల్పించడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా డీటీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖల్లో ఆర్థిక లావాదేవీలు, నిధుల మంజూరు ప్రక్రియలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ఇ-శాంక్షన్ విధానం ఉపయోగపడుతుందన్నారు. సంబంధిత అధికారులు ఈ విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకొని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్లైన్ ద్వారా నిధుల మంజూరు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. డిజిటల్ విధానాల అమలుతో పనుల్లో జాప్యాన్ని తగ్గించడంతో పాటు జవాబుదారీతనాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ... ఇ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల సేవా వివరాలు, సెలవులు, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలను ఆన్లైన్లో నిర్వహించేందుకు వీలుంటుందన్నారు. వామిస్ ద్వారా ప్రభుత్వ పనులకు సంబంధించిన ఆర్థిక వివరాలు, బిల్లులు, ఖాతాల నిర్వహణను డిజిటల్ విధానంలో చేపట్టవచ్చని వివరించారు. ప్రతి అధికారి ఈ విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, రోజువారీ కార్యాలయ కార్యకలాపాల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లతో సంబంధిత అధికారులకు శిక్షణను అందించారు. ఈ శిక్షణకు జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది హాజరయ్యారు.

ఎల్‌నినో ఎఫెక్ట్ : భారత్‌కు ఆ మూడు ముప్పులు- ప్రపంచవ్యాప్తంగా 27.4 కోట్ల మందికి ఆహార సంక్షోభం



భారత్‌లో ఎల్‌నినో ప్రభావంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రం నుంచి పుట్టుకొచ్చిన ఈ శతాబ్దపు అత్యంత శక్తివంతమైన 'సూపర్ ఎల్‌నినో' దేశంలో మూడు రకాల విపత్తులను సృష్టించే అవకాశం ఉంది. రుతుపవనాల గతి దెబ్బతినడం, శీతాకాలంలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడం, దేశ ఆహార సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం వంటి ముప్పులు ఎల్‌నినో వల్ల దేశంలో ఏర్పడున్నాయి. మరోవైపు, ఈ ఎల్‌నినో పరిస్థితులు 2027 చివరినాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 27. 4 కోట్ల మందికి ఆహార సంక్షోభాన్ని కలిగించవచ్చని ఐరాసకు చెందిన 'వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్' హెచ్చరించింది. 45 దేశాల ప్రజలు తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనా వేసింది. అందుకే ఈటీవీ భారత్ స్పెషల్ స్టోరీలో ఇండియా వ్యవసాయ, ఆర్థిక రంగంపై ఎల్‌నినో ప్రభావం ఎంత? దేశంలో ఆహార సంక్షోభం తప్పదా? అనే విషయాలను తెలుసుకుందాం.

భారత్‌పై ఎల్‌నినో త్రిపుల్ అటాక్!

మొదటిది- ఈ ఏడాది దేశంలో రుతుపవనాల వ్యవస్థను ఎల్‌నినో తీవ్రంగా దెబ్బకొట్టింది. సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో అనేక ప్రాంతాల్లో కరవు పరిస్థితులు వచ్చాయి. రెండోది- సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో భారత్‌లో తీవ్రమైన చలి ఉంటుంది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఈ శీతాకాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి చలికాలంలో వేసవి అనుభూతి కలుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. శీతాకాలంలో కూడా ఫ్యాన్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. మూడోది- రుతుపవనాలు సరిగ్గా లేకపోవడంతో ఇప్పటికే భారత్‌లో ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వర్షాలు సరిగ్గా కురవకపోవడం వల్ల ఎండకు ఎండిపోయాయి. అయితే శీతాకాలంలో పెరిగే వేడి వల్ల రబీ పంటలు కూడా తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

ఎల్‌నినో వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆహార సంక్షోభం

మరోవైపు, ఎల్‌నినో కారణంగా 2027 చివరినాటికి ప్రపంచంలోని 45 దేశాల్లో తీవ్ర ఆహార సంక్షోభం ఏర్పడవచ్చని ఐరాస అనుబంధ సంస్థ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ అంచనా వేసింది. తత్ఫలితంగా 27.4 కోట్ల మంది ఆహార సంక్షోభం బారిన పడొచ్చని హెచ్చరించింది. మరోవైపు, వాతావరణ మార్పులు, భౌగోళిక రాజకీయ సంఘర్షణల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఎరువుల కొరత తీవ్రమైందని ఐఎంఎఫ్ తన నివేదికలో పేర్కొంది. దీని ఫలితంగా బియ్యం ధరలు 50శాతం, గోధుమల ధరలు 37శాతం, సోయాబీన్స్ ధరలు 21శాతం మేర పెరిగాయని ఆందోళన వ్యక్తం చేసింది.

భారత్, ఇండోనేసియా ఎల్‌నినో ప్రభావం

రుతుపవనాల వైఫల్యం, జలాశయాల్లో నీటి మట్టాలు తక్కువగా ఉండటంతో భారత్ ప్రస్తుతం ఒక భారీ ఆర్థిక, వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలో మొక్కజొన్న ఉత్పత్తి 28--32శాతం, వరి ఉత్పత్తి 12--18శాతం, పప్పు ధాన్యాల ఉత్పత్తి 14--17శాతం మేర తగ్గవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం 3--5శాతం మేర పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇదిలా ఉండగా, ఎల్‌నినో దక్షిణ, ఆగ్నేయాసియా అంతటా గణనీయమైన రుతుపవన లోటు, రికార్డు స్థాయి వడగాలులు, కరవు పరిస్థితులు, తీవ్రమైన అటవీ కార్చిచ్చులకు కారణమైంది. ఈ ఎల్‌నినో వల్ల భారత్, ఇండోనేసియా అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి. భారత్‌లో రుతుపవనాలను ఎల్‌నినో తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో దేశంలో లోటు వర్షపాతం నమోదైంది. ఇండోనేసియాలో అటవీ కార్చిచ్చుల నుంచి వెలువడిన ప్రమాదకరమైన పొగ వల్ల లక్షలాది మంది ప్రభావితమయ్యారు.

వ్యాధులు ప్రబలే అవకాశం

దేశంలో ఎల్‌నినో వల్ల తీవ్రమైన వేడి, మారుతున్న వర్షపాత సరళి కారణంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వైరస్ వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంకొన్ని ప్రాంతాల్లో వరదల వల్ల నీటి సరఫరా కలుషితమై కలరా, టైఫాయిడ్ వంటి నీటి సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని అంటున్నారు. అలాగే అధిక ఉష్ణోగ్రతల వల్ల వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటివి ఎదురవుతాయని చెబుతున్నారు. ఈ పరిస్థితులు వృద్ధులకు, పిల్లలకు ప్రాణాంతకం కావచ్చని హెచ్చరిస్తున్నారు.

సీఈసీ, ఈసీలకు జీవితకాల చట్టపరమైన రక్షణ- విచారణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్- కేంద్రానికి నోటీసులు

ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన చర్యల నుంచి విస్తృత రక్షణ కల్పించే నిబంధనపై సుప్రీం కోర్టు విచారణకు అంగీకరించింది. ఈ చట్ట నిబంధన రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలించిన ధర్మాసనం- కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోకా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, సామాజిక కార్యకర్త అరుణ్ అగ్రవాల్ పిటిషన్లు దాఖలు చేయగా దీనిపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన ధర్మాసనం విచారణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇదే అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో కలిపి ఈ కేసుల్ని విచారిస్తామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు తెలిపింది.

సెక్షన్ 16పైనే పిటిషనర్ల సవాల్- అసలు ఇదేంటి?

2023లో రూపొందించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్, కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) చట్టంలోని సెక్షన్ 16 ను పిటిషనర్లు ఇక్కడ సవాల్ చేస్తున్నారు. ఈ నిబంధన ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ లేదా ఎన్నికల కమిషనర్‌గా ప్రస్తుతం పని చేస్తున్న వ్యక్తిపై, గతంలో ఆ పదవిలో పనిచేసిన వ్యక్తిపై కూడా విధుల నిర్వహణలో చేసిన పనులు, వ్యాఖ్యలకు సంబంధించి ఏ కోర్టు కూడా సివిల్ లేదా క్రిమినల్ కేసుల్ని స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసుల్ని కూడా కొనసాగించకూడదు. ఈ మేరకు సెక్షన్ 16 నిబంధన సీఈసీ, ఈసీలకు జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణ కల్పిస్తోంది. అయితే ఈ ఇమ్యూనిటీ వారికి పదవిలో ఉన్నంతవరకే కాకుండా, పదవీ విరమణ తర్వాత కూడా వర్తిస్తుందనేదానిపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలు, ఇతర తీవ్రమైన నేరాలకు పాల్పడినా ఈ నిబంధనల వారికి మినహాయింపు కల్పిస్తోందని పేర్కొంటున్నారు.

రాజ్యాంగం కల్పించని రక్షణ చట్టం ఎలా కల్పిస్తోంది?

తన పిటిషన్‌లో మనోజ్ ఝా ఈ సెక్షన్ 16 రాజ్యాంగ విరుద్ధం అని వాదించారు. ఎన్నికల కమిషనర్లు ఎన్నికైన ప్రజాప్రతినిధులు కాదని, అయినప్పటికీ వారికి రాష్ట్రపతి, ఎంపీలు, న్యాయమూర్తులకు రాజ్యాంగం కల్పించిన రక్షణ కంటే విస్తృతమైన ఇమ్యూనిటీని సాధారణ చట్టం ద్వారా కల్పించారని అభ్యంతరం తెలిపారు. రాష్ట్రపతి, గవర్నర్లకు ఆర్టికల్ 361, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఆర్టికల్స్ 105, 194 కింద కొన్ని ప్రత్యేక రక్షణలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. అయితే ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన ఆర్టికల్ 324లో ఇలాంటి మినహాయింపు లేదని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలోనే సీఈసీని తొలగించాలనే నిబంధన ఉందని, అది భద్రతకు ఉద్దేశించినదే తప్ప, చట్టపరమైన చర్యల నుంచి సంపూర్ణ మినహాయింపు కాదని వివరించారు.

ఒక ఎంపీ అవినీతికి పాల్పడితే విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని, అదే విదంగా న్యాయమూర్తులపై కూడా కేసులు నమోదు చేయొచ్చని ఝా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. ఇలా చేయకుంటే అధికారుల విధుల పేరుతో నేరానికి పాల్పడినా చర్యలు తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ వ్యక్తినీ రాజ్యాంగం చట్టానికి అతీతంగా ఉంచలేదని, అందుకే సాధారణ చట్టం ద్వారా అలాంటి రక్షణ కల్పించలేరని వాదించారు.

మరోవైపు కార్యకర్త అరుణ్ అగ్రవాల్ కూడా ఇదే అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. సెక్షన్ 16లోని ఝా శీతీ ఝుం అనే పదాలు పదవిలో ఉన్నవారితో పాటు పదవీ విరమణ చేసిన వారికి కూడా జీవితకాల రక్షణ కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడం ముఖ్యమేనని, అయితే స్వతంత్రత అంటే చట్టానికి జవాబుదారీగా ఉండకపోవడం కాదని అగర్వాల్ పేర్కొన్నారు. ఎన్నికల జాబితా నుంచి ఒక ఓటరు పేరు తప్పుగా తొలగించినా, ఎన్నికల కమిషన్ దురుద్దేశపూర్వకంగా అభ్యర్థికి నష్టం కలిగించినా, కమిషన్‌లో అవినీతి జరిగిందని పౌరులు ఆరోపించినా ఇక్కడ ఎలాంటి చర్యలు తీసుకోలేకుండా వారికి చట్టపరమైన రక్షణ అందుతోందని పిటిషనర్లు వాదించారు. ప్రస్తుతం సర్ ప్రక్రియలోనే ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే సెక్షన్ 16ను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించి రద్దు చేయాలని పిటిషనర్లు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై స్పందనలు తెలియజేయాలని కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసిన సుప్రీం కోర్టు- డిసెంబర్ 18 కి విచారణ వాయిదా వేసింది.

Printed, Published and Owned by J BHASKER, and Printed at Sunday Printing Press, H.No.361, Bhagyalaxmi Colony, Quthbullapur, MEDCHAL MALKAJGIRI, Telangana- 500054. and Published from H.No.3-87, Gangaram, Marepalli, Kondapur, SANGAREDDY, TELANGANA - 502306.. Editor: J BHASKER. PRGI NO : TGTEL/25/A3369 Email: samastaprakshalanam@gmail.com. Phone No: 9959479375, 9398191920.